బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి

సారంగాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన ఓలత్రి పోతన్న, మలక్ చించోలి గ్రామములో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన దాసరి పోశవ్వ బాధిత కుటుంబాలను గురువార మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి , అడెల్లి దేవాలయం చైర్మన్ సింగం భోజాగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ గారి రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల మహేష్, మాజీ ఎంపీపీ అట్లా మైపాల్‌రెడ్డి, మాజీ అడెల్లి దేవాలయం చైర్మన్ అయిటి చందు, నాయకులు మాధవ్‌రావు, సాకిపెల్లి సురేందర్, ఉట్ల రాజేశ్వర్, నారాయణ్‌రెడ్డి, బట్టు భోజన్న ఉన్నారు.

బాసరకు కావాలి ఆసరా!




ట్రిపుల్‌ఐటీలో మంత్రి సీతక్కకు సమస్యలు విన్నవిస్తున్న విద్యార్థులు (ఫైల్)

- సమస్యల వలయంలో బాసర
- ఒక పక్క ప్రముఖ ఆలయం.. మరో పక్క ట్రిపుల్ ఐటీలో సమస్యలు
- దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోని వైనం
- ఉమ్మడి జిల్లా మంత్రి వివేక్, కొత్త ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావుపై బాసర వాసుల ఆశలు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు

బాసర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బాసర క్షేత్రం ఉమ్మడి జిల్లాకే తలామానికంగా నిలుస్తోంది. ఒక పక్క చదువుల తల్లి సరస్వతీ మాత కొలువై ఉన్న సుప్రసిద్ధ క్షేత్రం... మరో పక్క రాష్ట్రంలో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఆర్జీయూకేటీ నెలవైన ప్రాంతం. నిత్యం పర్యాటకులతో విరాజిల్లుతున్న ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధి విషయంలో గత కొన్ని రోజుల నుంచి పడకేసింది. సమైక్య రాష్ట్రంలో ఆశించి స్థాయిలో అభివృద్ధి జరగక పోగా... ప్రత్యేక రాష్ట్రంలో మరింత బాసర క్షేత్రం అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీని, అమ్మవారి ఆలయాన్ని పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాకు కొత్తగా మంత్రివర్గంలో చోటు లభించడం, జూపల్లి కృష్ణారావు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులు కావడంపై బాసర అభివృద్ధిపై స్థానిక వాసుల్లో ఆశలు చిగురించాయి.

• అమ్మవారి ఆలయంపై నిర్లక్ష్యం

ప్రత్యేకరాష్ట్రంలో వివిధ దేవాలయాలు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరిగింది. మరి కొన్ని చోట్ల కొనసాగుతుంది. కానీ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఒకటయిన సరస్వతీ అమ్మవారి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. దేశంలోనే రెండో ప్రాచీన సరస్వతీ మాత దేవాలయంగా విరాజిల్లుతున్న ఈ ఆలయానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. చిన్నారులకు అక్షరశ్రీకారం చేయించేందుకు అమ్మవారి చెంతకు చేరుకుంటారు. రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతూ ఉంది. వసతులు మాత్రం తగ్గిపోతున్నాయి. కనీసం తాగునీరు వంటి సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అమ్మవారికి వచ్చిన ఆదాయం నిర్వహణకే సరిపోతుంది. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆలయ అభివృద్ధి విషయంలో స్థానికుల ఆశలపై అప్పటి ప్రభుత్వం నీళ్లు చల్లింది. సాక్షాత్తు దేవాదాయశాఖ మంత్రి పదేళ్ల పాటు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. అయనప్పటికీ బాసర అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వం చివరిలో రూ. 50 కోట్లు మంజూరు చేసింది. అప్పటి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధి కోసం శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మాత్రం కొనసాగలేదు. ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిలిచిపోయింది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అదనపు నిధులు ఇవ్వాల్సింది పోయి గత ప్రభుత్వం ఇచ్చిన రూ.50కోట్లను వెనక్కి తీసుకుంది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా అసలే అభివృద్ధి జరగడం లేని పరిస్థితుల్లో వచ్చిన నిధులు ఈ ప్రభుత్వం లాగేసుకోవడంపై స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ప్రస్తుతం నిధులు లేక బాసర ఆలయ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వెనక్కి వెళ్లిన నిధులతో పాటు మరికొన్ని నిధులు కేటాయిస్తే బాసర ఆలయం అభివృద్ధికి మార్గం సుగమవుతుంది. ప్రభుత్వం శ్రద్ధ పెట్టి 2027 సంవత్సరంలో జరిగే గోదావరి పుష్కరాల వరకు అమ్మవారి ఆలయ అభివృద్ధిని చేయాల్సిన అవసరం ఉంది. అమ్మవారి ఆలయానికి కనీసం రెగ్యులర్ ఈవో లేరు. ఇన్‌చార్జీ అధికారులతో పరిపాలన గాడి తప్పింది. అసలే అరకొర సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పరిపాలన లోపం భక్తులకు మరింత శాపంగా మారింది. కనీసం తాగునీరు అందించని పరిస్థితి ఉంది. ఏదైన సమస్య ఉత్పన్నమైతే పరిష్కరించే ప్రయత్నం చేసే నాధుడు లేడు. ఈవోనే లేక పోవడంతో కిందిస్థాయి సిబ్బంది తీరు ఇష్టారాజ్యమైంది. మరోవైపు అవినీతి అక్రమాలు పెరిగి పోయాయి

• ట్రిపుల్ ఐటీ నిండా ట్రబుల్స్

రాష్ట్రంలో ఉన్న ఏకైక ఈ విశ్వవిద్యాలయంలో 9000 మంది విద్యార్థులు చదువుకంటూ ఉండగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత రెండు మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు యూనిఫార్మ్ ఇతర సామాగ్రి, ల్యాప్‌టాప్స్ వంటివి ప్రభుత్వం నుంచి సమకూరడం లేదు. ఈ ఏడాది అయినా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సినవి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ నియామకం జరగలేదు. ఇన్‌చార్జీ అధికారులతోనే కొనసాగుతుంది. ఫలితంగా తాత్కాలికంగా ఉంటున్న అధికారులు యూనివర్సిటీ పరిపాలనపై పట్టు సాధించలేక పోతున్నారు. సంస్థాగతంగా మార్పులకు అవకాశం లేకుండా పోతుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీ రోజురోజుకు తన పూర్వ వైభవం కోల్పోతూ వస్తుంది. రెగ్యులర్ వైస్‌చాన్సలర్‌ను నియమించాలని ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. సుమారు 150 అధ్యాపకులు పోస్టులు పదేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందక చాలా మంది విద్యార్థులు పరీక్షల్లో తప్పుతున్నారు. ఆధ్యాపక పోస్టులను భర్తీ అత్యవసరంగా ఉంది. యూనివర్సిటీ ఏర్పాటు చేసి 15 సంవత్సరాలు గడుస్తుంది. మౌలిక వసతులు మరమ్మత్తుల స్థాయికి చేరుకున్నాయి. సరైన వసతులు లేక నిత్యం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. క్యాంపస్‌లో ఉన్న ఆసుపత్రి ప్రథమ చికిత్సలకే పరమితమైంది. విద్యార్థులకు తీవ్రమైన జ్వరం వస్తేనే భైంసా లేదంటే నిజామాబాద్‌కు తరలించాల్సిన పరిస్థితి. క్యాంపస్‌లో ఉన్న 30 పడకల ఆసుపత్రిలో వైద్య నిపుణులతో పాటు ఇతర వైద్య సేవలను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. యూనివర్సిటీ ప్రధానంగా కంట్రాక్టర్లకు ఆదయవనరుగా మారిపోయింది. కాంట్రాక్టు గడువు ముగిసి మూడు సంవత్సరాలు దాటుతున్న ఇంకా వారినే కొనసాగిస్తుండడంపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి గత ప్రభుత్వంలో మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదేశించినా టెండర్లను మాత్రం పిలవ లేదు. కొత్త సంస్థలకు కాంట్రాక్టు అప్పగించడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. గతంలో పలుమార్లు కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతతో ఆసుపత్రిపాలైన ఘటనలు ఉన్నాయి. భోజనం అందించే సంస్థల కాంట్రాక్టు గడువు మూడు సంవత్సరాల ముందే ముగిసింది. సమయానికి టెండర్లు వేయక పోవడతో దీర్ఘకాలంగా పాత సంస్థలు కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల అండదండలతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో విద్యార్థులు అనేక సార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. మంత్రులు దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బాసర ఆలయ అభివృద్ధి విషయమై మంత్రి సీతక్కకు వివరిస్తున్న ఆలయ చైర్మన్, పండితులు (ఫైల్)

• రూ. 50కోట్లు వెంటనే విడుదల చేయాలి


శ్యామ్ బాసర

టీఆర్ఎస్ ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధికి మొదటి విడతగా రూ. 50కోట్లను ఇచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వెంటనే విడుదల చేయాలి. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి పనులు ప్రారంభించాలి.

• బాసరపై దృష్టి పెట్టాలి


ధనుంజయ్, బాసర

బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇక్కడ వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పులిహోర, లడ్డూ ప్రసాదం నాణ్యత పెంచాలి. ప్రఖ్యాతి గాంచిన దేవాలయానికి కనీసం రెగ్యులర్ ఈవో లేడు. భక్తుల సమస్యలను పట్టించుకునే నాధుడు లేడు. మరోపక్క ట్రిపుల్‌ఐటీలో రెగ్యులర్ వీసీ లేడు. అక్కడ వేలాది మంది విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాసరపై దృష్టి పెట్టి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలి.

మంత్రి జూపల్లి కృష్ణారావుకు

స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు


ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి అల్లోల, కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ రూరల్, 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన నేపథ్యంలో నిర్మల్ రూరల్ మండలం ఎల్లపల్లి గ్రామం వద్ద మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గురువారం స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన మొదటి సారిగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశానికి హాజరు కానున్నారని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గెలుపే లక్ష్యంగా పని చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆరోపణలు సరికాదు

• ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్



కడెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు పనిగట్టుకొని అసత్యపు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణం అన్నారు. కడెంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కనీసం ఊరికి ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతీ గ్రామంలో అర్హులకు ఇళ్లు ఇచ్చి పేదలకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు కొందరు కొన్ని పత్రికలను అడ్డం పెట్టుకొని అసత్యపు రాతలు రాయిస్తున్నారని, ఇంకోసారి ఇలాంటివి పునరావృతం అయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి

దిలావర్‌పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని డా. శ్రీవిద్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మనకు వ్యాధులు రాకూడదంటే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రమైన నీటితో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. తడి బట్టలను ధరించవద్దన్నారు. ఫంగల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వర్షాకాలంలో అంటు రోగాలు కూడా వేగంగా వ్యాపించే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించిన మీ టీచర్లకు చెప్పాలని వెంటనే చికిత్స చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అపర్ణ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, కేజీబీవీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

• మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి ఆర్‌సీవో శ్రీధర్


మామడలో వంట గదిని పరిశీలిస్తున్న ఆర్‌సీవో శ్రీధర్


ఎవరెస్టును అధిరోహించిన గోకుల్ నాయక్‌ను సన్మానిస్తున్న ఆర్‌సీవో

మామడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి ఆర్‌సీవో శ్రీధర్ అన్నారు. గురువారం రోజున మామడ మండల కేంద్రంలో గల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డ్‌ని పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాల గురించి చర్చించి విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ యూనిఫామ్ ప్రారంభంలోనే విద్యార్థులకు అందాయని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చూడాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి పిల్లాడు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే కాస్మోటిక్ డబ్బులు ప్రతి విద్యార్థికి బ్యాంక్ అకౌంట్‌లోనే జమ చేస్తామని, ప్రతీ విద్యార్థితో బ్యాంక్ అకౌంట్ తీయించాలని తెలియజేశారు. అనంతరం కిచెన్‌లోకి వెళ్లి మెనూని పరిశీలించారు. వంట సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. వంట వండే ప్రదేశంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఇటీవలే ఎవరెస్టు శిఖరం అధిరోహించిన 9వ తరగతి విద్యార్థి గోకుల్‌నాయక్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, ఏటీపీ పుణ్యవతి, డీడబ్ల్యూవో గంగాజమున, పీఈటీ శ్రీకాంత్, నాగరాజు, నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్సకు ఎల్‌వోసీ చెక్కుల అందజేత

భైంసా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న ఇద్దరికి మెరుగైన చికిత్సల కోసం గాను మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందజేశారు. గురువారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను పంపిణీ చేశారు. కుంటాల మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన ఎనుకొండ పద్మకు రూ. 2.5 లక్షలు, భైంసా పట్టణంలోని మహ్మద్ జాఫర్ హైమద్‌కు రూ. 2లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్‌వోసీ చెక్కుల ద్వారా నిధులు మంజూరయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని వారి కుటుంబాలకు జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణరావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కల సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా ఎల్‌వోసీ చెక్కులను మంజూరు చేయించడం జరిగిందని వివరించారు. ఇందులో అంబకంటి మాజీ సర్పంచ్ ప్రవీణ్, మండల ప్రతినిధులు నర్సయ్య, గజ్జారాం, తదితరులున్నారు.


బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీ చెక్కులు అందజేస్తున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి : డీఈఈ


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ

ముథోల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సరైన నివాసం లేని అర్హులైన నిరుపేద ప్రజలకు గూడు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో నిర్మించి ఇవ్వాలని హౌసింగ్ డీఈఈ దయానంద్ మేస్త్రీలకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణం సంస్థ ద్వారా నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలలకు చెందిన మేస్త్రీలకు ముథోల్ మండల అభివృద్ధి కార్యాయలంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో గురువారం మాట్లాడారు. ఇళ్లు కట్టడంలో మేస్త్రి ప్రాముఖ్యత చాలా ముఖ్యం అని సూచించారు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు శ్రీకాంత్, శ్రీనివాస్, నియోజకవర్గ పరిధిలోని ముథోల్, తానూర్, బాసర, భైంసా, లోకేశ్వరం, కుబీర్ తాపీ మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కల పంపిణీ

ముథోల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవంలో భాగంగా మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గురువారం మొక్కలు నాటి ఇంటింటికీ ఆరు మొక్కలను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అందజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, నాయకులు రాజుకుమార్ పాల్గొన్నారు.



కడెం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సాయికిరణ్



కడెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కడెం నూతన ఎస్సైగా పి.సాయికిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన కృష్ణసాగర్‌రెడ్డి బదిలీపై జగిత్యాల జిల్లా గొల్లపల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో నర్సాపూర్(జి)లో పని చేసిన సాయికిరణ్‌ను కడెం పోలీసుస్టేషన్‌కు కేటాయించారు.

పీజీ లా సెట్- 2025 ఫలితాల్లో

మల్లాపురం వాసి ప్రతిభ


సహస్ర చందన

లక్ష్మణచాంద, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసిన పీజీ లాసెట్- 2025 ఫలితాల్లో లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన సహస్ర చందన రాష్ట్రస్థాయిలో 190వ ర్యాంక్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ప్రభుత్వ అధ్యాపకుడు ప్రసాద్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మంజుల దంపతుల కుమార్తె అయిన సహస్ర చందన హైదరాబాద్‌లోని అంబేద్కర్ లా కళాశాలలో లా గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ర్యాంక్ సాధించిన సహస్ర చందన మాట్లాడుతూ... ఉస్మానియా యూనివర్సిటీలో లాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి జూనియర్ సివిల్ జడ్జి అవ్వడమే తన లక్ష్యమని చెబుతోంది. తమ బిడ్డ రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సహస్ర చందనను స్నేహితులు, బంధువులు అభినందించారు.

న్యూ వెల్మల్‌లో స్మశాన వాటికలో

కుప్పకూలిన వాటర్‌ట్యాంక్‌లు


కూలిపోయిన వాటర్‌ట్యాంక్

సోన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ వెల్మల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల వైకుంఠధామం (స్మశాన వాటిక)లోని స్నానాలు చేసే నీటిట్యాంక్ గద్దె కూలిన ఘటన గురువారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గతంలో వైకుంఠధామాన్ని ఈజీఎస్ నిధులతో నిర్మించారు. అయితే అక్కడ స్నానాలు చేయడానికి నీటిట్యాంక్‌ల నిర్మాణం సరిగ్గా చేయలేదు. దీంతో స్థానికులు ఇటీవల నూతనంగా నీటి ట్యాంక్‌ల కొరకు గద్దెను నిర్మించి, దాని పైన 1500ల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల రెండు ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణం చేసి మూడు నెలలు కాకముందే బుధవారం రాత్రి కురిసిన చిరుజల్లులకే కూలిపోవడంతో చూసేవారికి నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఏఈ సాయివర్ధన్‌ను వివరణ అడుగగా ఆ నిర్మాణానికి అనుమతులు లేవని, నిధులు కూడా కేటాయించలేదని పేర్కొన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా

నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠినచర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు విద్యాశాఖ సూపరిండెంట్ రమణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఎం. దినేష్, విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, నగర కార్యదర్శి ఎం. సాయి కుమార్, జశ్వంత్, సిద్ధు, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

● జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
● సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్న మొల్ల కిరణ్

మావల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ గోపిని కలిసి ఆశాల సమ్మె నోటీసు అంద జేశారు. అనంతరం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడి ఆశాలచేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయి. కానీ కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం నుండి గుర్తింపు కార్డులను వెంటనే పంపిణీ చేయాలి, పెండింగ్‌లో ఉన్న యూనిఫామ్, రిజిస్టర్ బిల్లులను వెంటనే ఆశాల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. సుజాత, పార్వతి, లతా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న నకిలీ బాబా అరెస్టు

ఇచ్చోడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అమాయకులకు, ఆదివాసీలకు తాయిత్తులతో వ్యాధులు, రోగాలు నయం చేస్తానంటూ నమ్మిస్తూ మోసం చేస్తున్న నకిలీ బాబాపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సర్కిల్ సీఐ బండారి రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన నిందితుడు షేక్‌అహ్మద్ ప్రజలకు మాయమాటలు చెప్పి మంత్రాలు, తంత్రాలు అంటూ తాయిత్తులు కడుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నాడని ఇచ్చోడ పోలీసులు నిందితున్ని అదుపులో తీసుకున్నామని చెప్పారు. అనారోగ్య సమస్యలు ఏదురైతే ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుత్రులను ఆశ్రయించాలే తప్ప ఇలాంటి నకిలీ బాబాలను ఆశ్రయించవద్దని సూచించారు. మంత్రతంత్రాలతో వ్యాధులు నయం కావని వాటివల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ఏక్కడైనా ఇలాంటి నకిలీ బాబాలుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ప్రభుత్వ బడులపై రాష్ట్ర సర్కారు చిన్నచూపు

● బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్

ఉట్నూర్, జూన్26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో పేరుకుపోతున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ ఆరోపించారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఉట్నూర్ మండలంలోని గంగన్నపేట, గంగన్న పెట్, ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సందర్శించి పలు సమస్యలు తెలుసుకున్నామన్నారు. ధరణి రాజేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో లక్క పురుగులతో కూడిన దోడ్డు బియ్యం పిల్లలకు భోజనం పెడుతూ పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. ఎండీఎం కార్మికులకు వెంటనే వారికి నెల నెల జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు మొహమ్మద్ ముజీబ్, కోలా సత్తన్న, సాజిద్, జయ చంద్ర, సూర్య కాంత్ యాదవ్, దినేష్, కిరణ్ శివ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో భారీ వర్షం

● అత్యధికంగా జైనథ్‌లో 137.7 మి.మీ. వర్షం
● కుంటాల, పొచ్చెర జలపాతాల పరవళ్లు
● వరదలో చిక్కుకొని యువకుడి గల్లంతు

ఆదిలాబాద్, జూన్26 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు, పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే లోతట్టు ప్రాంతాలు, పంటపొలాలు జలమయమయ్యాయి. జిల్లా విశ్వసమయం వర్షపాతం 10.3 మిల్లీమీటర్‌లు కాగా అధికంగా 85.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా జైనథ్ మండలంలో 137.7 తాంసిలో 135.3, భోరజ్‌లో 126.3, తలమడుగులో 121.3, ఇచ్చోడలో 117.7, గుడిహత్నూర్‌లో 111.2 ఆదిలాబాద్ అర్బన్‌లో 104.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి చాంద, నిషాన్ ఘట్, తర్నం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా చెప్పుకునే కుంటాల, పొచ్చెర జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి. అదిలాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని నిషాన్ ఘాట్ వాగులో చేపల వేటకు వెళ్లిన డాల్డా కంపెనీ కాలనీకి చెందిన శేఖర్ (19) వరదనీటిలో మునిగి గల్లంతయ్యాడు. కాపాడేందుకు ప్రయత్నించినా మరో ఇద్దరు స్నేహితులు సురక్షితంగా బయటపడ్డారు. జైనథ్ మండలం తర్నం వద్ద లోలెవల్ వంతెన పూర్తిగా మునిగిపోవడంతో బేల, జైనథ్ మహారాష్ట్ర వైపునకు వెళ్లే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆదిలాబాద్ నుంచి నిరాల గ్రామం మీదుగా రాకపోకలు సాగాయి. ఈసీజన్‌లో ఇదే భారీ వర్షం కావడంతో లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండిపోయాయి. జైనథ్ మండలంలో పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలు పంటలకు అనుకూలంగానే ఉన్నాయని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న తర్నం వాగు



వరదతో నిండుగా ప్రవహిస్తున్న చందా వాగు

వాగులో యువకుడు గల్లంతు

మావల: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నిషాన్ ఘాట్ వాగులో పడి గల్లంతయ్యడు. ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని డాల్డా కంపెనీకి చెందిన జాదవ్ కృష్ణ, ఆకాశ్, శేఖర్ అనే ముగ్గురు కలిసి చేపలు పట్టేందుకు వెళ్లారు. అయితే వాగులో దిగాక వాగులో ప్రవాహం ఎక్కువ ఉండటంతో ఆకాశ్, శేఖర్‌లు అందులో చిక్కుకున్నారు. ఇందులో ఆకాశ్‌కు ఈత రావడంతో బయటపడగా శేఖర్ మాత్రం వాగు ప్రవాహానికి కొట్టుకుపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జాలార్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

రేషన్ బియ్యం తీసుకోని లబ్ధిదారులపై విచారణ!

బోథ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ రేషన్‌షాపుల ద్వారా మండలం మొత్తం మీద 113 మంది లబ్ధిదారులు బియ్యం తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. దీంతో జిల్లా ఉన్నతాధికారి ఆదేశానుసారం రేషన్ బియ్యం ఎందుకు తీసుకోవడం లేదనే విషయమై విచారణ చేపడుతున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయానికి ఇందుకు సంబంధించిన 113 మంది లబ్ధిదారుల జాబితా రావడంతో రెవెన్యూ అధికారులు విచారణ సిద్ధమయ్యారు. ఈ 113 మంది లబ్ధిదారులు రేషన్ లబ్ధిదారులు ఉన్నారా లేరా..?, ఉంటే బియ్యం ఎందుకు తీసుకోవడం లేదు?, లేకుంటే వలస వెళ్లారా ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు. విచారణలో స్థానికంగా లబ్ధిదారు లేరని తెలిస్తే వారి రేషన్ కార్డులను రద్దు చేసే అవకాశం ఉంది.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

● తలమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి

తలమడుగు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తలమడుగు మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన రూ.కోటీ 56లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండేవిటల్, కలెక్టర్ రాజార్షిషాలు కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. వైద్యంసేవలు అందించేందుకు ఆధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకే వెళ్లాలని సూచించారు. ఇందులో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఎంపీ నాగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఎమ్మెల్సీ దండే విటల్, కలెక్టర్, ఎస్పీ అఖిల్ మహజన్, తదితరులున్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆదివాసీ గూడాల్లో ప్రారంభమైన అకాడి పూజలు

ఉట్నూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఆషాడ మాసంలో నిర్వహించే అకాడి పూజలు ప్రారంభమయ్యాయి. పంటలు సమృద్ధిగా పండాలని, వన్యమృగాల నుంచి పశువులను, మనుషులను కాపాడాలని కోరుతూ అడవిదేవతకు ఆదివాసీ గిరిజనులు పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తోంది. గురువారం ఉట్నూర్ మండల పరిధిలోని మత్తడిగూడలో ఆదివాసుల తొలకరి పండుగ అకాడి రాజుల్ పేన్ పూజలు నిర్వహించారు. గ్రామ పొలిమేరలో ఉన్న ఇప్పచెట్టు వద్దకు చేరుకొని ఆదివాసులు కేవలం పురుషులు మాత్రమే పాల్గొని అడవిదేవతకు పూజలు నిర్వహించారు. అక్కడే వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పటేల్ సిడాం రాంషా, సిడాం సోనేరావు పటేల్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిడాం జంగ్ దేవ్, పంద్ర ఆనంద్ రావు, ఆత్రం సూర్యరావు, కనక లాచ్చు పాల్గొన్నారు.

నార్నూర్: మండలంలోని మన్నపూర్ గ్రామం వద్ద గ్రామ ప్రజలు అందరూ కలిసి అడవికి ఆచార సంప్రదాయాల పరంగా దేవులకు పూజలు చేశారు. గ్రామంలో ఎలాంటి రోగాలు రాకుండా, గోరక్షణ, పంటలు బాగా పండాలని, వర్షాలు కురువాలని మొక్కుకుంటారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ రుప్ దేవ్, తొడసం నాగోరావు, చంద్రశవ్, దేవరి, మోతిరాం, తదితరులు పాల్గొన్నారు.



అడవిలో పూజలు చేస్తున్న గిరిజనులు

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

(5వ పేజీ తరువాయి)

సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు.

ఇన్‌చార్జి మంత్రి ప్రశ్నలతో తడబడిన వ్యవసాయ శాఖ

అధికారుల సమీక్ష సమావేశంలో మొదట వ్యవసాయ శాఖ పనితీరుపై సమీక్షా సమావేశాన్ని ప్రారంభించారు. దీంతో జిల్లా కలెక్టర్ రాజా ర్షీ షా వ్యవసాయ శాఖ పనితీరుపై నివేదికలను చదివి వినిపించారు. ఆ తర్వాత ఇన్‌చార్జి మంత్రి జూపల్లి జోక్యం చేసుకొని గత పది ఏళ్లుగా నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకంపై ఎంత మందిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు ఎంతమందికి శిక్ష పడింది. ఎన్ని కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయి. నిందితులకు ఎలాంటి శిక్షలు వేస్తున్నారు అని ప్రశ్నించారు. దీనిపై సమాధానమివ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామిని త్వరగా తడబడినట్లు కనిపించింది. ప్రస్తుతం తన వద్ద పదేళ్లకు సంబంధించిన కేసుల వివరాలు లేవని తర్వాత అందజేస్తానని మంత్రికి తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్‌లు దీనిపై పూర్తి నివేదికను తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. అయితే వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలోనే ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని మాట్లాడడంతో ఇతర శాఖల జోలికి వెళ్లినట్లు కనిపించలేదు. సమయం మించి పోవడంతో వ్యవసాయ శాఖ సమీక్షతోనే సమావేశాన్ని ముగించాల్సి వచ్చింది.

అలిగిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి..

జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్ష సమావేశానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కొంత ఆలస్యంగా వచ్చారు. దీంతో వేదిక చివరగా అధికారులు కుర్చీని ఏర్పాటు చేశారు. దీంతో వేదికపై కూర్చోవడం ఇబ్బందికరంగా మారిందంటూ అలిగారు. కొంత సేపటి తర్వాత వేదికపై నుంచి వచ్చి అధికారుల మధ్యలో కూర్చున్నారు. దీనిని గమనించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోవా లక్ష్మీ వద్దకు వచ్చి తాను కూర్చున్న కుర్చీలో కూర్చోవాలని సూచించారు. అయినా వేదికపైకి వెళ్లకపోవడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కల్పించుకొని కోవ లక్ష్మీని వేదికపైకి రావాలని పిలవడంతో అలక వీడింది.

మంత్రులకు తృటిలో తప్పిన ప్రమాదం..

రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్‌లకు తృటిలో ప్రమాదం తప్పింది. గురువారం మంత్రులు జిల్లా పర్యటనలో భాగంగా గాంధీ విగ్రహానికి పూలమాలువేసి నివాళులర్పించేందుకు గాంధీ పార్కు చేరుకున్నారు. ఈ సమయంలోనే గాంధీ విగ్రహం సమీపంలో ఉన్న చెట్టుకొమ్మ విరిగి పడింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యాయి. వెంటనే మంత్రులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ర్యాలీ

కడెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కడెం ఏఎస్సై మాన్‌సింగ్ సూచించారు. కడెంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ఆయన అవగాహన కల్పించారు. యువత మద్దు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అరోధించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.



దస్తురాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా గురువారం ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మున్యాల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు మోజులో పడి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మండలంలో మత్తు పదార్థాల కట్టడికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి.. పచ్చదనం పంచాలి

దిలావర్‌పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విరివిగా మొక్కలు పెంచడం ద్వారా పచ్చదనాన్ని విస్తృతం చేయాలని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. గురువారం దిలావర్‌పూర్ మండలకేంద్రంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో చంద్రశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ రద్దు కావడంతో

మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు

లక్ష్మణచాంద, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు సర్వీస్ రద్దు కావటంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. మండలంలోని చింతల్‌చందా గ్రామానికి సాయంత్రం 6 గంటలకు నిర్మల్ నుంచి బయలు దేరాల్సిన బస్సు సర్వీస్ రద్దయ్యింది. దీంతో కనకాపూర్, వడ్యాల్, రాచాపూర్, పొట్టపెల్లి, లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, చింతల్‌చందా గ్రామాలకు చెందిన మహిళా ప్రయాణికులు నిర్మల్ బస్టాండ్‌లోని సర్వీస్ సెంటర్‌కు వెళ్లి విచారించగా సాయంత్రం ఏడు గంటలకు సర్వీస్ కేటాయిస్తామన్నారు. కానీ గత రెండు గంటల నుండి వేయిట్ చేస్తున్నప్పటికీ మీరు సర్వీస్‌ను కేటాయించటంలో విఫలం అయ్యారని పలువురు అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటికీ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ సౌకర్యంను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నట్లు వారు వాపోయారు. చేసేదేమి లేక ప్రైవేట్ వాహనంలో గమ్యస్థానాలకు బయలుదేరారు.

ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రిలో ఫాగింగ్

నర్సాపూర్(జి), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది గురువారం ప్రభుత్వ కార్యాలయాలు, 30 పడకల ఆసుపత్రి ప్రాంగణంలో విస్తృతంగా ఫాగింగ్ నిర్వహించారు. దోమల బెడదను తగ్గించి, ప్రజారోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మురికి కాలువలు పూడిక తీసి శుభ్రంగా ఉంచాలని, పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి కైలాస్ ప్రజలను కోరారు.

సమయపాలన పాటిస్తే విద్యా ప్రమాణాలు మెరుగవుతాయి

సోన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు అవగాహన కార్యక్రమం మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కొరకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, యోగా, ధ్యానం, జీవన నైపుణ్యాలు, నైతిక విలువల గురించి విద్యార్థులకు బోధించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యాశాఖకు సంబంధించిన వివిధ యాప్‌ల గురించి వెబ్‌సైట్ల గురించి ఎంఐఎస్ కోఆర్డినేటర్ దుర్గ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్ఫర్మేషన్ సిస్టం కోఆర్డినేటర్ దుర్గ, సీఆర్పీ అనసూయ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థుల భారీ ర్యాలీ

నర్సాపూర్(జి), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో నర్సాపూర్(జి) జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ సీఐ కృష్ణ, హెచ్‌ఎం పురుషోత్తం పర్యవేక్షణలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ సీఐ కృష్ణ మాట్లాడుతూ... మదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును ఎలా నాశనం చేస్తాయో పట్టణం నలుమూలల మార్చ్ వేశారు. ముఖ్యంగా జాతీయ రహదారి 61పై మాన వహారం చేపట్టి, మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేశారు. ఈ మానవహారంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని, తమ ఐక్యతను చాటారు.

కుంటాల : విద్యార్థులకు ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకావద్దని ఎస్‌ఐ అశోక్, ఎంఈవో ముత్యం అన్నారు. గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకొని మండల కేంద్రమైన కుంటాల హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

అందరి చూపు.. రిజర్వేషన్ల వైపు!

● నలుగురు కలిసిన చోట ఎన్నికల చర్చలే..
● పంచాయతీల్లో నెగ్గేందుకు ఆశావహుల హడావుడి

ఇచ్చోడ, జూన్ 26, (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠకు తెరపడింది. మూడు నెలల్లో గ్రామపంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తిచేయాలని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చెసింది. స్థానిక పోరుపై నలుగురు కలిసిన ప్రతి చోట చర్చలు మొదలయ్యాయి. పంచాయితీలపై పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటునాయి. అభ్యర్థుల ఎంపిక, వారి బలాలు, బలహీనతలపై దృష్టి సారించనున్నాయి.

ఆశావహుల్లో ఉత్కంఠ

హైకోర్టు తీర్పుతో ఆశావహుల్లో ఉత్కంఠ మొదలైంది. రోటేషన్ పద్దతిలో రిజర్వేషన్లు ఉండడంతో పాత స్థానాల్లో కొత్తగా ఏమొస్తుందనేది నేతల్లో ఆశక్తి నెలకొంది. జడ్పీచైర్మెన్ మొదలు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి, వార్డుసభ్యుల వరకు అన్ని సానాల్లో రోటేషన్ పద్దతి అమలు కానుండడంతో అందరి చూపు రిజర్వేషన్లపై పడింది.

గత ప్రభుత్వం తీసుకొచ్చిన పంచాయితీరాజ్ చట్టం 2018 ప్రకారం పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ అమల్లో ఉండాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయితీ రాజ్ చట్టాన్ని సవరించింది. అందుకే ప్రస్తుత రిజర్వేషన్లు మారనున్నాయి. రిజర్వేషన్లు పక్కాగా ఉండే స్థానాల్లో మహిళా, జనరల్ రిజర్వేషన్ల ఏలా వస్తాయోనని ఆశావహులు ఏదురు చూస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలు దగ్గర పడడంతో పార్టీల నాయకులు, పోటీదారులు తమ పార్టీ అభ్యర్థిలని ఏలా గెలిపించుకోవాలోనని, పోటీదారుడు గెలవా లంటే ఏం చేయాలోనని ఇప్పటినుంచే పావులు కదుపుతున్నారు. గ్రామా ల్లో, కాలనీల్లో ఉదయం లేవగానే ఇంటింటికి చక్కర్లు కొడుతూ.. మంచి చేడుల వివరాలు తెలుసుకుంటూ ఓటర్లను తమవైపు తిప్పుకునేలా ప్రత్యేకంగా చర్యలు చేపడు తున్నారు. ఏస్టీ రిజర్వుడ్ ప్రాంతాల్లో ఎస్టీ రిజర్వేషన్ వస్తుండడంతో మహిళా అయినా సరే.. పురుషులు అయినా సరే మా ఇంట్లోంచి పోటీకి తయారుగా ఉన్నామని పలువురు అభ్యర్థులు ఓటరు జాబితా ముందు పెట్టుకొని ఓటర్లను కలిసి తమకు మద్దతు తెలపాలని అభ్యర్థిస్తున్నారు. ఓటర్లను దగ్గర చేసుకునేందుకు మంచి చేడు, కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ కార్యక్రమాలకు హాజరవుతూ.. నేనూ మీవాన్నే మీకు అండగా ఉంటానని హామీలు ఇస్తూ ప్రచారాలను కొనసాగిస్తున్నారు కొందరు అభ్యర్థులు..



ఏజెన్సీ ప్రాంతమైన ఎస్టీ రిజర్వ్‌డ్ ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయితీ కార్యాలయం

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

● నిర్మల్ జిల్లాలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం

భైంసా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉజ్వల భవిష్యత్తు కోసం యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని భైంసా టౌన్ సీఐ గోపినాథ్ పిలుపునిచ్చారు. గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకొని పట్టణ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న టౌన్ సీఐ గోపినాథ్

ముథోల్ : మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి మంచి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ముథోల్ ఎస్సై బిట్ల పెర్సెస్ సూచించారు. గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేకదినం సందర్భంగా మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు నరసింహచారి, నాయకులు నిమ్మ పోతన్న, గంగారెడ్డి, గురు ప్రసాద్, ఉదయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, తది తరులున్నారు.

తానూర్ : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని తానూర్ మండల ట్రైని ఎస్సై నవనీత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తానూర్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిబాబా, పోలీసు సిబ్బంది, విద్యార్థులున్నారు.

భైంసా రూరల్ : మండలంలోని మహాగాం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల గురించి కలిగే నష్టాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సోన్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ పిల్లల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలందరికీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు హెచ్‌సీ ప్రతాప్‌రెడ్డి, విఠల్, రాజ్‌కుమార్, కీర్తన, సంధ్య, హైస్కూల్ ఉపాధ్యాయులు, యువత, స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని వడ్యాల్ గ్రామంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'సే నో టు డ్రగ్స్' అనే నినాదిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, ప్రధానోపధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిండుకుండలా దేగామ చెరువు

కురిసిన వర్షం.. మురిసిన కర్షకలోకం!

ఇచ్చోడ/బజార్‌హత్నూర్, జూన్26 (ఆంధ్రజ్యోతి) : గత రెండ్రోజులుగా ఏడతెరిపి లేకుండా కురిని వర్షాలకు వాగులు పొంగి పోర్లుతున్నాయి. మండలంలోని ఎగువన ఉన్న ప్రాంతమైన భూతాయి, చందు నాయక్ తండా చెరువుల్లో వరదనీరు భారీగా చెరింది. ఎగువనుంచి దిగువకు వచ్చిన వర్షపునీటితో బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ చెరువు గురువారం నిండుకుండలా ఆహ్లాదకరంగా కనిపించింది.

నేటి నుంచి మొహరం ఉత్సవాలు

● మత సామరస్యానికి నిలయం ● రుయ్యాడి, తలమడుగు ఉత్సవాలకు మంత్రుల రాక

తలమడుగు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అమావాస్య తరువాత కనిపించే నెలవంక రోజు నుంచి మొహరం ఉత్సవాలను ప్రారంభించేందుకు మండలంలోని తలమడుగు, రుయ్యాడి గ్రామస్థులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూలై 4, 5, 6న ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు హస్సన్ హుస్సేన్ ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షులు లోక భూమారెడ్డి తెలిపారు. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక పీరీల పండుగ. మతాలకతీతంగా జరుపుకునే తెలంగాణ ప్రజల పండుగ మొహరం. తలమడుగు, రుయ్యాడి గ్రామాలకు చెందిన పీరీల చరిత్ర వందేళ్ళకుపైగా ఉంది. ఈ పండుగలో స్థానికులు చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఆనందోత్సాహాల మధ్య పాల్గొంటారు. అంతేకాకుండా మొహరం పండుగ సందర్భంగా రుయ్యాడి గ్రామస్తులు పది రోజుల పాటు కాళ్లకు చెప్పులు ధరించకుండా ఉంటారు. అలాగే మద్యం తాగకుండా భక్తి శ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ పండుగ జరుపుకోవడం వల్ల గ్రామంలో శాంతి సామరస్యాలతో పాటు మొక్కులు నెరవేరుతాయని గ్రామస్థుల ప్రగాఢ నమ్మకం. మొహరం పండుగ రోజు నైవేద్యం, మలీద ముద్దలు, పులి హోర వంటి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ పీరీల ఉత్సవాలను తిలకించేందుకు తెలంగాణ జిల్లాల నుంచి కాకుండా మహారాష్ట్ర జిల్లాల నుంచి కూడా అధికసంఖ్యలో భక్తులు వస్తారు. పీరీలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం, మంచినీటి వసతి ఏర్పాట్లు చేశారు.



రుయ్యాడిలో మొహరం పండుగకు ముస్తాబైన ప్రాంగణం

భారీ వర్షంతో జోరందుకున్న సాగు పనులు

● బిజీబిజీగా మారిన అన్నదాతలు ● నిర్మల్ జిల్లాలో 44.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు



భైంసా ప్రాంతంలో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు



భైంసాలో కురిసిన వర్షంతో ఇబ్బందులు పడుతున్న కూరగాయల విక్రయదారులు



ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు

భైంసా,జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పది రోజులుగా వరుణుని కరుణ కోసం గాను రైతాంగం చేస్తున్న పూజలు ఫలించాయి. రైతన్నల మొర ఆలకించిన వరుణ దేవుడు కరుణించాడు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వేళ వరకు భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పక్షం రోజులకు పైగా కాలం నుంచి అంతంత మాత్రంగా కొనసాగిన వానకాలపు సాగు పనులు భారీ వర్షంతో ఒక్కసారిగా జోరందుకున్నాయి. అనుకూలమైన వాతవరణం ఏర్పడిన నేపథ్యంలో గురువారం అన్ని ప్రాంతాల్లో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కడి ప్రాంత వ్యవసాయ క్షేత్రాలు చూసిన రైతన్నలు వివిధ సాగు పనులు చేస్తూ కనిపించారు. ఇన్నాళ్ల వరకు అనుకూలమై వర్షాలు లేక విత్తనాలు వి త్తక ఎదురు చూపులు చూసిన అన్నదాతలు వరుణ దేవుడు కరుణిం చ డంతో విత్తనాలు విత్తే పనుల్లో బిజీబిజీగా అయ్యారు. ఇది వరకే విత్తనాలు విత్తేందుకు గాను భూములను సిద్దం చేసుకున్న రైతులు ప్రస్తు తం అను కూలంగా వర్షం కురియడంతో విత్తనాలను విత్తుతున్నారు.ఇక వి త్తిన విత్తనాలు మొలకెత్తి తడులు లేక వాడిపోతుండగా బుధవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంతో వాటికి జీవం పోసినట్లయ్యింది . జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూములన్నీ రైతుల పనులతో సందడిగా కనిపించాయి..



పంట చేలలో నిలిచిన వర్షపు నీరు

● జిల్లాలో 44.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా గురువారం 44.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అత్యధికంగా పెంబి మండలంలో 72.6 మి.మీటర్ల వర్షపాతం నమోదు అవ్వగా అత్యల్పంగా తానూర్ మండలంలో 20.6 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. నిర్మల్ మండల పరిధిలో 68.8 మి.మీటర్లు , సారంగపూర్ మండలంలో 55.8 మి.మీటర్లు, దిలావర్‌పూర్ మండలంలో 55.2మి.మీటర్లు , కుభీర్ మండలంలో 54.8 మి.మీటర్లు, నిర్మల్ పట్టణంలో 54.4మి.మీటర్లు , నర్సాపూర్ మండంలో 54 మి.మీటర్లు, కుంటాల మండలంలో 48.2 మి.మీటర్లు , భైంసా మండలంలో 46.2 మి.మీటర్లు , కడెం మండలంలో 42.4 మి.మీటర్లు , లక్ష్మణ్‌చాంద మండలంలో 42.4 మి.మీటర్లు, మామడ మండలంలో 39.2 మి.మీటర్లు, దస్తూరాబాద్ మండలంలో 36.8 మి.మీటర్లు , ఖానాపూర్ మండలంలో 36.6 మి.మీటర్లు, లోకేశ్వరం మండలంలో 33.2 మి.మీటర్లు, సోన్ మండలంలో 30.2 మి.మీటర్లు, ముథోల్ మండలంలో 29 మి.మీటర్లు, బాసర మండలంలో 24.6 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

● జలమయమైన లోతట్టు ప్రాంతాలు

భారీ వర్షంతో జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు చిన్నపాటి చెరువులు, కుంటలను తలపించాయి. వర్షపు నీరు ఉధృతితో ప్రవహించడం మూలంగా మురికి కాలువలు పొంగి పొర్లి ప్రవాహించాయి, వాటిల్లోని చెత్తచేదారం, వ్యర్థాలు అంతర్గత రోడ్లపై పేరుకపోయాయి. రోడ్లపై గల గుంతలలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.



గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి నీటి నిల్వలు

గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 510 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



గడ్డెన్న వాగు ప్రాజెక్టు

భైంసా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక మొదలయ్యింది. గురువారం ప్రాజెక్టులోకి 510 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఈ సీజన్‌లో ప్రాజెక్టులోకి మొదటి వారంలో 500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా, బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం మూలంగా 510 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7మీటర్లు, 1.852 టీఎంసీలు ఉంది. కాగా ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 355.5 మీటర్లు ఉండగా 0.633 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. వదర నీరు వచ్చి చేరుతుండటతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమక్రమంగా పెరుగనుంది. గత 8 నెలల కాలంగా అంతంత మాత్రంగానే నీటి నిల్వలతో బోసిపోయి కనిపించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టు ప్రస్తుతం వరద నీరు వచ్చి చేరుతుండడంతో జలకళను సంతరించుకుంటోంది.

కురిసిన వర్షం.. మురిసిన రైతు

● మొక్కకు ఊపిరి పోసిన వాన

ముథోల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నిన్నటి వరకు సాగుపై అన్నదాతల్లో నెలకొన్న ఆందోళనపై బుధవారం రాత్రి కురిసిన వర్షం ఆశలు రేకెత్తించింది. వాడుతున్న మొక్కలకు ఊపిరి పోసినట్లయింది. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాల కారణంగా ఇక్కడి ప్రాంత రైతులు పత్తి, సోయా, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేశారు. 15 ఏళ్ల తర్వాత మొదటిసారి నైరుతి రుతు పవనాలు 15 రోజులు ముందుగానే రావడంతో మొదట వర్షాలు కురిశాయి. దీంతో రైతులు మురిసిపోయారు. వివిధ విత్తనాలు విత్తారు. అయితే వరుణుడు ముఖం చాటేయడంతో కొందరి రైతుల విత్తనాలు మొలకెత్తక నష్టం వాటిల్లింది. మరి కొందరివి మొలిసిన మొలకలు వాడు చూపాయి. ఇంకొందరు రైతులు వర్షం కురిస్తే విత్తనాలు వేసేందుకు సిద్ధం అంటూ 10 రోజుల నుంచి వాన కోసం ఆకాశం వైపు చూశారు. ఈ తరుణంలో బుధవారం కురిసిన వర్షంతో పంటలకు కొంతమట్టుకు జీవం పోసినట్లయింది. మండలంలో 29 ఎంఎం వర్షపాతం నమోదైంది. రైతులు సంతోషంతో పొలంబాట పట్టారు.



సోయా పంట

నేడు ఏజెన్సీకి మంత్రుల రాక

● కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా సమావేశం నిర్వహించడం లేదని ఉమ్మడి జిల్లా గిరిజనుల ఆందోళన ● జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఏజెన్సీ ప్రాంతాల సమస్యలు

ఉట్నూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మూడు నెలలకోసారి పాలక వర్గ సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమగ్ర అభివృద్ధి సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించి గిరిజనుల అభివృద్ధికి దిశా.. దశ చూయించాల్సిన ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలను పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఒకే ఒక్కసారి పాలక వర్గ సమావేశం నిర్వహించారు. మూడోసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండేళ్లు కావస్తున్నా సమావేశం ఊసెత్తడం లేదని ఉమ్మడి జిల్లా గిరిజనులు పేర్కొంటున్నారు.



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏ..

ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఉట్నూర్ కేంద్రంగా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేశాయి. 1981 ఏప్రిల్ 20లో జరిగిన పోలీసు కాల్పుల అనంతరం జిల్లా కేంద్రంలో ఉన్న ఐటీడీఏ కార్యాలయాన్ని ఉట్నూర్‌కు తరలించి ఒక ఐఏఎస్ అధికారిని ప్రాజెక్ట్ అధికారిగా నియ మించి, 29 శాఖల ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యకలా పాలకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం ముందుగా విద్యా, వైద్యం, వ్యవసాయం, చిన్న తరహా నీటిపారుదల పథకాలు, గిరిజనులకు ప్రత్యామ్నాయ ఆదాయం కల్పించే పథకాలు ప్రారంభించారు. ప్రతియేటా సుమారు రూ.30 కోట్లతో బడ్జెట్ ఏర్పాటు చేసుకొని కేంద్ర సహాయ పథకాలను చేపట్టి గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తూ వచ్చారు.

తెలంగాణ రాష్ట్రం వచ్చాక..

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాల విభజన ఏర్పాటు చేయడంతో ఉమ్మడి జిల్లా గిరిజనులకు ఐటీడీఏ పథకాలు దూరం అవుతూ వచ్చాయి. 2019 అక్టోబర్ 30న తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశం మొదటిసారిగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జెడ్పీ టీసీలు, హాజరై ఆయా ప్రాంతాల అభివృద్ధికి గిరిజనుల సంక్షేమం కోసం అనేక విషయాలు వివరించారు. యదా మామూలుగా అధికారంలో ఉన్న మంత్రులు శాసనసభ్యులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో పథకాలు అంతంత మాత్రమే అయ్యాయి.

బిల్లులు రాక పీవీటీజీ గిరిజనుల పరేషాన్..

రూ.25 ఓట్లతో కేంద్ర ప్రభుత్వం ద్వారా ఐటీడీఏ అధికారులు చేపట్టిన పీవీటీజీ గిరిజనుల ఇళ్ల పథకానికి కావాల్సిన నిధులు పీవీటీజీ గిరిజనులు ఇబ్బందులు పడతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ పథకం ద్వారా రూ.25 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని ఆదిమ గిరిజనులైన కొలాం, తోటి గిరిజనుల కోసం వెయ్యి గృహాలు 2022లో మంజూరు చేసింది. ఒక్కొక్క ఇంటికి రూ.2.50 మంజూరు చేసి ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కేంద్రం నుంచి తొలి విడత నిధులు రూ 8.50 కోట్లు వచ్చిన రెండో విడత నిధులు రూ.16.50 కోట్లు రాకపోవడంతో పనులు కొన్ని నిలిచిపోగా పనులు పూర్తి చేసి ఇండ్లలోకి వెళ్లిన గిరిజనులకు నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడతున్నారు.



కుమురం భీం ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ సమావేశ మందిరం

ఎత్తివేసిన శాఖలు పునరుద్ధరించాలి..

ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం ఐటీడీఏలో ఇది వరకుది ఉన్న ప్రభుత్వ శాఖలను తిరిగి పునరుద్ధరించాలని జిల్లా గిరిజనులు కోరుతున్నారు. ఐటీడీఏలో మైనర్ ఇరిగేషన్, భూగర్భ జల శాఖ, ఏజెన్సీ విద్యాశాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ, ఐకేపీ, పట్టు పరిశ్రమ, పరిశ్రమల శాఖలు ఎత్తివేయడం వల్ల గిరిజనులకు ప్రత్యామ్నాయ ఆదాయం లభించడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఎత్తివేసిన శాఖలు పునరుద్ధరిస్తే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంక్షేమానికి మార్గం చేరువ అవుతుందని గిరిజనులు భావిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు, ఉమ్మడి జిల్లా కార్మిక శాఖ మంత్రి, జిల్లా ప్రజా ప్రతినిధులు శాఖల పునరుద్ధరణతోపాటు సమయం ప్రకారం పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలని గిరిజనులు కోరుతున్నారు.

నేడు ఉట్నూర్‌కు మంత్రులు..

తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి భవనంపై అదనపు వంద పడకల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం కొమురం భీం ప్రాంగణంలో గిరిజన నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గిరిజనుల సమస్యలపై చర్చించనున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తుంది.



వేదికపై తమకు కేటాయించిన కుర్చీలను చూస్తున్న ఎమ్మెల్యేలు

కుర్చీలతో గందరగోళం.. స్థలం లేక ఎమ్మెల్యేల అసహనం

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకట స్వామితో పాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వేదికపై స్థలం సరిపోక ఎమ్మెల్యేలు ఇబ్బంది పడడం చర్చనీయాంశంగా మారింది. తొలుత ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తనకు కేటాయించిన స్థలంలో కూర్చోగా ఎంపీ గోడం నగేష్ రావడంతో ఆయనకు సీటును కేటాయించి కలెక్టర్ రాజర్షిషా పక్కన కూర్చున్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీకి సైతం స్థలం లేక మెట్ల వద్ద కుర్చీ ఏర్పాటు చేయడంతో ఆమె కొంత ఇబ్బందికి గురై కిందకి వచ్చి కూర్చున్నారు. గమనించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి ఆమెను వేదిక పైకి వచ్చి కూర్చోవాలని కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం కల్పించుకుని వేదిక పైకి రావాలని కోరడంతో తిరిగి వేదికపైకి వచ్చి కూర్చు కున్నారు.



కుర్చీలు మారడంతో నేమ్ ప్లేట్లు మారుస్తున్న కలెక్టర్

ఘనంగా ఆషాడమాసం బోనాల జాతర

బోథ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో గురువారం గ్రామ మహిళలు ఆషాడ మాసం బోనాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పొచ్చెరలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

కుంటాల జలపాతానికి జలకళ



జలకళ సంతరించుకున్న కుంటాల జలపాతం

నేరడిగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల కుంటాల జలకళను సంతరించుకుంది. వేసవిలో నీరు లేక వెలవెలబోయినా ప్రముఖ పర్యాటక కేంద్రమైన కుంటాల జలపాతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కడెం నదిలో వరద నీరు చేరడంతో కుంటాల జలపాతం నిండుగా జాలువారుతుంది. జలపాతానికి జలకళ సంతరించుకోవడంతో కుంటాల జలపాతానికి పర్యాటకుల తాకిడి ప్రారంభం కానుంది. తన అందాలతో పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేసి మైమరిపించేందుకు కుంటాల జలపాతానికి వరద నీరు చేరుతోంది. జలపాతం పరిసరాల్లో ఉన్నా అడవి వర్షాలకు ఏపుగా పెరగడంతో అందాలు కనువిందు కలిగిస్తోంది.

నేడు హైదరాబాద్‌లో ఉపాధ్యాయుల ధర్నా

ఉట్నూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు కదిలి రావాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లక్కెట్టిపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడులు, కళాశాలలు పరిరక్షణకు 27న ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్యా కార్పొరేటీకరణ కాషాయీకరణను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని, పాఠశాలల విద్యావ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని మానుకోవాల ని, కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం విద్యకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు విఠల్, కార్యదర్శి కే.గోపాల్, చౌహన్ రమేష్, విజయ్ కుమార్, కోవనాగోరావు, జె.సురేష్, బాపురావు, కైలాష్, ఎ.అన్నపూర్ణ పాల్గొన్నారు.



లక్కెట్టిపేటలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● ఇచ్చోడలో విద్యాలయ పాఠశాల విద్యార్థుల ప్లకార్డులతో ర్యాలీ



ఇచ్చోడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాలయ పాఠశాల విద్యార్థినులు

ఇచ్చోడ, జూన్ 26, (ఆంధ్రజ్యోతి) : మత్తులో యువత జీవితం బుగ్గిపాలు కాకుండా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్ మార శ్యామ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలన వారోత్సవాలల్లో భాగంగా ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన విద్యాలయ పాఠశాల విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల నుంచి ప్లకార్డులను చేతపట్టి రోడ్డు గుండా ర్యాలీ నిర్వహిస్తు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌కు చెరుకున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి పాఠశాలకు వెళ్లే మార్గంలో మాదక ద్రవ్యాల గుర్చి పలువురికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమోద్, ఉపాధ్యాయులు సుభాష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో లీకేజీలు

● కొత్త భవనం అయినా తప్పని ఇబ్బందులు

బోథ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయం అవసన దశకు చేరుకుంది, అందులో విధులు నిర్వహించడం వల్ల ఇబ్బందులు తలెత్తే ఆస్కారం ఉన్నందున అధికారులు ఎన్నికల అధికారి కార్యాలయాన్ని నిర్మించారు. అయితే అందులోనే తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం రెవెన్యూ అధికారులు అక్కడే విధులు నిర్వ హిస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు నుంచి నీరు రావడంతో అధికారులు కొత్త భవనంలో సైతం ఇబ్బందులు తప్పేట్టు లేవని పేర్కొంటున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి ప్రతీ వర్షాకాలం మాదిరి గానే కొత్త భవనంలో సైతం ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది వాపోతున్నారు.



పైకప్పు భాగంలో నుంచి లీకేజీ కావడంతో ఫ్యాన్ నిలిపివేసిన అధికారులు



లీకేజీ నీటి కోసం బకెట్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ఆదిలాబాద్, జూన్26(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, డీఏపీ ఎరువులు కొంత మేరకు అవసరమని జిల్లాఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈయేడు ఎలాంటి విత్తనాలు, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించిన ఏడుగురు వ్యాపారులపై కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున పంటల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- పథకాలను పక్కాగా అమలుచేస్తున్నాం: మంత్రి వివేక్
- వ్యవసాయ శాఖకే పరిమితమైన మంత్రుల సమీక్ష
- నియోజకవర్గాల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యేలు
- గాంధీ పార్కులో మంత్రులకు తృటిలో తప్పిన ప్రమాదం
- స్టేజీపై కూర్చోవడంపై అలిగిన ఎమ్మెల్యే కోవలక్ష్మి
- మంత్రులకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల ఘనస్వాగతం



సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆదిలాబాద్, జూన్26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌తో కలిసి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మావల ఎక్స్ రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు మంత్రులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాకేంద్రంలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాఅధికారుల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం చేపట్టిన పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చట్టాలను చేస్తే వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. అభివృద్ధి కోసం అధికారులు మనస్ఫూర్తిగా పని చేయాలని సూచించారు. ప్రతీఒక్కరికి పని చేయాలన్న తపన ఉండాలన్నారు. గతంలో ధరణితో ఎన్నో సమస్యలు ఉండేవని కొత్తగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిన తర్వాత అధికారులు సమస్యల పరిష్కారం దిశగా పనిచే యాలన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే దరఖాస్తులు రాసి సంబంధిత అధికారులకు వాట్సాప్ ద్వారా పంపించాలని అన్నారు. దరఖాస్తులను పరిశీలించి అధికారులు పరిష్కారం చూపాలన్నారు. కలెక్టర్‌లు పథకాల అమలుపై సమీక్షలు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా అధికారులు ఇంటింటా సర్వేలు చేయాలని సూచించారు. ప్రజాపాలనలో ప్రభుత్వానికి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అసలైనఅర్హులకు పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా మళ్లీ అధికారుల సమీక్ష (మిగతా 6వ పేజీలో..)

రైతు భరోసాపై సంబరాలు ఎందుకు ?



• ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (నిర్మల్ ఎమ్మెల్యే)

రాష్ట్ర ప్రభుత్వం ఏం సాధించిందని సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. ఇదే చివరి రైతు భరోసానా లేక మళ్లీ రైతు భరోసా ఉంటుందా లేదా ప్రభుత్వం చెప్పాలి. నిర్మల్ జిల్లాలో వరిధన్యం కొనుగోళ్లలో భారీ అవకతవకలు జరిగాయి. ఒక్కో క్వింటాలుకు 5, 6 కేజీలను దోపిడీ చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి. అటవీ భూములను సాగు చేయడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. అటవీశాఖ అధికారులు రైతులను భయపెడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలి.

అటవీశాఖ అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు



• వెడ్మ బొజ్జు (ఖానాపూర్ ఎమ్మెల్యే)

ఖానాపూర్ నియోజకవర్గంలో అటవీశాఖ అధికారుల తీరుతోనే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. చాలా గ్రామాల్లో రైతులను ఇబ్బందుల గురిచేస్తున్నారు. 40 ఏళ్లుగా పంటలను సాగు చేస్తున్న అడ్డుకుంటున్నారు. అడ్డగోలుగా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వెంటనే 49 జీఓను రద్దు చేయాలి. ఏజెన్సీలో గిరిజనేతర రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలి. జిల్లా వెనుకబాటు కాదు వెనుకకు నెట్టేస్తున్నారు. విద్యా వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలి.

రాష్ట్రంలో రెండు జిల్లాలకే నిధులు కేటాయిస్తున్నారు..



• పాయల శంకర్ (ఆదిలాబాద్ ఎమ్మెల్యే)

రాష్ట్రంలో రెండు జిల్లాలకు మాత్రమే ఎక్కువగా నిధులను కేటాయించి ఇతర జిల్లాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. అదిలాబాద్ నియోజకవర్గంలో నిర్మిస్తున్న కోర్టా చనాక బ్యారేజీకి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి. ఇప్పటి వరకు రూ.900 కోట్లకు పైగా నిధులను ఖర్చు చేశారు. అయినా ఏం ప్రయోజనం లేకుండానే పోయింది. కేవలం రూ.100 కోట్ల నిధులను మంజూరు చేస్తే రెండు మూడు నెలల్లోనే సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. వర్షాకాలం కావడంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారుతుంది. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ పరిధిలో టెండర్లను వేసిన పనులను ప్రారంభించడం లేదు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల నియమించాలి. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే కేంద్ర ప్రభుత్వం పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉంది. అదిలాబాద్ ను టూరిజం స్పాట్ గా అభివృద్ధి చేయాలి. ఫసల్ బీమా పథకాన్ని వెంటనే అమలు చేస్తే జిల్లా రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం..



• మంత్రి గడ్డం వివేక్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చినహామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సమస్యలు ఉన్నా ఆరు గ్యారెంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. జిల్లాఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి జిల్లాధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి కృష్ణారావును ప్రభుత్వం నియమించడం అదృష్టంగా భావిస్తున్నామని, ఆయనకు పాలనపై ఎంతో అనుబంధం ఉందని, కలిసికట్టుగా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో ఆదివాసులు ఎక్కువగా ఉన్నారని వారి అభివృద్ధికి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. ఇందులో భాగంగానే తొమ్మిది రోజుల్లోనే అందరికీ రైతుభరోసా సొమ్మును జమచేశామన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందనివారికి మళ్లీ దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఎల్‌ఓసీ ఇవ్వడంలోనూ ఎమ్మెల్యేలకు ఎలాంటి ఇబ్బందులు లేవని సీఎంఆర్‌ఎఫ్ వెంట వెంటనే అందజేస్తున్నామన్నారు.

కుప్టి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలి



• అనిల్ జాదవ్ (బోథ్ ఎమ్మెల్యే)

బోథ్‌లోని కుప్టి ప్రాజెక్టును పూర్తిచేస్తే వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. ప్రభుత్వం వెంటనే ఈప్రాజెక్టును పూర్తిచేయాలి. గత ఏడాది బట్టి విక్రమార్క, బుగ్గారం పొచ్చారా పిప్రి లిఫ్టు ఇరిగేషన్ పథకాలకు అనుమతులు ఇచ్చిన ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. నియోజకవర్గంలో 64వేల మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 32 వేల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. ముఖ్యంగా బోథ్ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చి వెంటనే వైద్యులను నియమించాలి.

ఆదిలాబాద్ టు ఆసిఫాబాద్ రోడ్డుకు మరమ్మతులు చేయాలి

• కోవలక్ష్మి (ఆసిఫాబాద్ ఎమ్మెల్యే)



ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలి. టైగర్ రిజర్వుఫారెస్ట్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై కుట్రలు చేస్తోంది. ఆసిఫాబాద్ జిల్లాలో 366 గ్రామాలను ఖాళీ చేయించేందుకు జారీ చేసిన 49 జీఓను రద్దు చేయాలి. చాలాగ్రామాలకు రోడ్డు మార్గాలు లేవు. ఉట్నూర్‌లో నిర్వహించే సమావేశాన్ని ఆసిఫాబాద్‌లోనే నిర్వహించాలి.

ఉమ్మడి జిల్లాలో ఎంతమందికి రుణమాఫీ చేశారో చెప్పాలి

• గోడం నగేష్ (ఎంపీ ఆదిలాబాద్)



రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీ ఉమ్మడి జిల్లాలో ఎంత మంది రైతులకు అమలైందో అధికారులు చెప్పాలి. అలాగే పదో తరగతిలో ఎంతమంది విద్యార్థులు పాసయ్యారు. ఇంటర్‌లో ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయనే వివరాలు ఇవ్వాలి. మధ్యాహ్న భోజన నిధులు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి .చాలా ప్రభుత్వ పాఠశాలలో సరిగా కిచెన్ షెడ్లు కూడా లేవు. గిరిజనులకు ఇవ్వాల్సిన స్కాలర్ షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను కూడా వెంటనే విడుదల చేసి బిల్లులు చెల్లించాలి.



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

సిరికొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకాన్ని యువత వ్యతిరేకించాలని ఎస్సై శ్రీసాయి అన్నారు. గురువారం సిరికొండలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యాంటి డ్రగ్స్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసుసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ఉట్నూర్: ఉట్నూర్ మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ కాన్వెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం ప్రపంచ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుమీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్ వినోద్ అలెగ్జాండర్, ఉపాధ్యాయులు మేరీ, రేఖ విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అఖిల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్నారు. ఈ ప్రమాదం బారీన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించడం ద్వారా వారిపై చట్టపరమైన తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. అందరూ కలిసి గంజాయి రహిత సమాజం కోసం కృషి చేయాలని అన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త మండలాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

బోథ్, జూన్26 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన సోనాల మండలంలో సమస్యలను తీర్చాలని కోరుతూ గురువారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక నాయకులు వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో ప్రతీ బుధవారం జరిగే సంతకు చుట్టుపక్కల గ్రామాల వారు వివిధ రకాల సరుకులు చేసేందుకు వస్తున్నారని సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే సంత కొనసాగడం వల్ల వ్యాపారులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని రెండు కోట్ల రూపాయల మంజూరు చేసినట్లయితే సీసీ రోడ్డు నిర్మాణం చేసినట్లయితే ఇబ్బందులు తొలగిపోయే ఆస్కారం ఉందని వారు వివరించారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామం సమీపంలో ఉన్న శివాలయం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు ఇవ్వాలని విన్నవించారు. మండల కేంద్రంలో వెటర్నరీ ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని కోరారు. ఆరోగ్యకేంద్రంలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని, నూతనంగా ఏర్పాటైన గ్రామపంచాయతీలలో పంచాయతీ భవనాల కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రి విన్నవించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, బత్తుల రమేష్, కసిరే పోతన్న తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం ఇస్తున్న మాజీ ఎంపీ సోయం బాపురావు

బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ పరామర్శ

నార్నూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామంలో పిడుగుపా టుతో నలుగురు పంటపొలంలోనే మృతిచెందగా ఆ బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ సోయం బాపురావు పరామర్శించారు. వారికి తనవంతు ఆర్థిక సహాయం, వస్త్రాలు అందించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేసేలా ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వారివెంట ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావు, ఝరిరాయి సెంటర్ సార్మేడి మండడి దౌలత రావు, పుసం బాదిరావు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారుతి, ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కళ్లెం నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రాథోడ్ సందీప్ మరణం బాధాకరం: ఎమ్మెల్యే

నేరడిగొండ, జూన్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్గావ్ గ్రామానికి చెందిన రాథోడ్ ఇందల్ నాయక్ కుమారుడు రాథోడ్ సందీప్ అనారోగ్యంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ గురువారం వారి స్వగ్రామం సవర్గావ్‌లో రాథోడ్ సందీప్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యేవెంట మాజీఎంపీపీ రాథోడ్‌సజన్, మాజీసర్పంచ్ మహేందర్ ఉన్నారు.

నేరేడుపల్లి గ్రామానికి సీఆర్‌టీ నియామకం

బోథ్, జూన్26 (ఆంధ్రజ్యోతి): 'చదువుకుంటాం.. టీచర్‌ని పంపండి' అనే శీర్షికన బుధవారం ప్రచురితమైన 'ఆంధ్రజ్యోతి' కథనానికి అధికారులు స్పందించారు. నేరేడు పల్లి గ్రామానికి ఉపాధ్యాయుడిని నియమించారు. మండలంలోని పాట్నాపూర్ ఆశ్ర మం పాఠశాలలో ఉన్న సీఆర్‌టీని నేరేడుపల్లికి పంపించారు. అయితే ఉపాధ్యాయుల బదిలీల తర్వాత గ్రామానికి రెగ్యులర్ ఉపాధ్యాయుడిని పంపించనున్నట్లు తెలిసింది.



సీఆర్‌ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు

సీఆర్‌ఆర్ మరణం పార్టీకి తీరని లోటు

మావల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామిలు అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో మాజీ మంత్రి దివంగత రామచంద్రా రెడ్డి నివాసంలో ఆయన అల్లుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డిని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కాంగ్రెస్‌పార్టీకి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు మొదటిసారి వచ్చిన సందర్భంగా పరామర్శకు వచ్చామని, ఇందులో రాజకీయ కోణమేమీ లేదని మంత్రులు స్పష్టం చేశారు.

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని మంత్రికి వినతి

బోథ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలోని జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.రాజుయాదవ్ కోరారు. గురువారం మంత్రి జిల్లా పర్యటన వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి సన్మానించారు. అనంతరం పర్యాటక ప్రాంతాల గురించి విన్నవించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఘన స్వాగతం

గుడిహత్నూర్, జూన్26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు గురువారం మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆడే శీల, నాయకులు మస్కే మాధవ్, ససానె మాధవ్, పోలే విష్ణు, శంకర్, మారుతి, కరాడ్ శివదాస్, రమేష్ రాథోడ్, కృష్ణ, సుభాష్ తదితరులు ఉన్నారు.

మావల: పలు అభివృద్ధి పనులకు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర గనులు, కార్మిక, ఉపాధి శిక్షణ శాఖల మంత్రి వివేక్ వెంకట స్వామి లకు కాంగ్రెస్ శ్రేణులు మావల బైపాస్ వద్ద ఘన స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌చార్జిగా మంత్రిగా నియమితులైన తర్వాత జిల్లా కేంద్రానికి మొదటి సారిగా రావడంతో కాంగ్రెస్ శ్రేణులు భారీ గజమాలను ఏర్పాటు చేసి క్రేన్ సహాయంతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డిబోజారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాసరెడ్డి, తదితరులున్నారు.

ఆదిమ గిరిజనుల అభివృద్ధి కోసమే ప్రధానమంత్రి జన్‌మన్

• డీడీ అంబాజీ జాదవ్

ఉట్నూర్, జూన్26 (ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబ, జన జాతీయగ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ (జుగా) పథకాల ద్వారా పీవీటీజీ గిరిజనుల అభివృద్ధికి ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ జాదవ్ అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జన్ మన్, జుగా పథకం ద్వారా పీవీటీజీ గిరిజనుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. పీవీటీజీ, ఇతర గిరిజన సామాజిక వర్గాలకు గ్రామాల్లో ఇళ్లు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, మత్స్య సంపద, పశు సంపద, సెల్ టవర్ల నిర్మాణం తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. సంచార వాహనాల ద్వారా వైద్యసేవలు, రక్తపరీక్షలు నిర్వహించి వ్యాధులు నిర్ధారించి చికిత్సలు అందిస్తామన్నారు. గురువారం బోథ్‌లోని బాబెర, భీంపూర్ మండలంలోని వాదూర్, ఆదిలాబాద్‌లోని చించుఘాట్, ఇంద్రవెల్లి మండలంలోని అంజి, గాదిగూడ మం డలంలోని లొద్దిగూడ గ్రామాల్లో ప్రధానమంత్రి జుగా ద్వారా శిబిరాలు ఏర్పాటు చేశామని ఆధార్ నమోదు, కుల, ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతాలు, రేషన్ కార్డులు, జాబ్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.



చించుఘాట్‌లో పీవీటీజీ గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన శిబిరం

అంజిలో పీఎం జన్‌మన్

ఇంద్రవెల్లి: మండలంలోని అంజి గ్రామంలో గురువారం పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్, దర్తి జన జాతీయ అభియాన్, గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు మున్సిపల్ అధికారులు

• రూ. 15వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత



పట్టుబడ్డ అకౌంట్స్ అధికారి రాజ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవికుమార్

ఆదిలాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారుల దాడులు కలకలం రేపాయి. ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 15వేల లంచం తీసుకుంటుండగా.. మున్సిపల్ అకౌంట్స్ అధికారి రాజ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవికుమార్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో చేసిన రోడ్డు పనులకు సంబంధించిన బిల్లు ఇవ్వాలంటే రూ.20వేల లంచం ఇవ్వా లని ఓ కాంట్రాక్టర్‌ను మున్సిపల్ కార్యాలయంలో పని చేసే అకౌంట్స్ అధికారి రాజ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవి కుమార్‌లు డిమాండ్‌చేశారు. అంత ఇవ్వలేనని బాధితుడు బతిమాలడంతో రూ.15 వేలకు ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని సదరు కాంట్రాక్టర్ రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు వ్యూహంలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇద్దరు అధికారులకు కాంట్రాక్టర్ రూ. 15వేల లంచం ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన ఇద్దరిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డీఎస్పీ మధు తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త

• చర్యలు తీసుకోవాలంటూ మృతురాలి కుటుంబీకుల ఆందోళన



మృతురాలు సుజాత (ఫైల్)

నేరడిగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా భార్యను గొంతు నులిమి దారుణంగా హత్య చేసిన ఘటన నేరడిగొండ మండలం దర్బాతండాలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నేరడిగొండ మండలం దర్బాతండాకు చెందిన నటరాజ్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇతనికి నిర్మల్ జిల్లా మామడ మండలం గాయదపల్లి గ్రామానికి చెందిన సుజాత (21)తో ఐదే ళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలం వరకు సజావుగానే సాగిన వీరి సంసారంలో తర్వాత గొడవలు మొదలయ్యాయి. కుటుంబ సమస్యలతో ప్రతీరోజు గొడవ పడేవారు. ఈ విషయమై బుధవారం అర్ధరాత్రి కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన నటరాజ్ క్షణికావేశంలో భార్య సుజాతను గొంతు నులిమి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు గురువారం ఉదయం పెద్దసంఖ్యలో నేరడిగొండకు చేరుకొని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. హత్య చేసిన నటరాజ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్డుకోబోయిన పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న జిల్లా ఏఎస్పీ కాజల్ సింగ్ వెంటనే ఘటనా స్థలికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాగా.. హత్య చేసిన నటరాజ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, వీలైనంత త్వరలోనే అతన్ని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఇందులో ఇచ్చోడా సీఐ బండారి రాజు. నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ, బోథ్, బజారుహత్నూర్‌ల ఎస్సైలు ఉన్నారు.



మృతురాలి తల్లిని ఓదారుస్తున్న ఏఎస్పీ కాజల్‌సింగ్